సాక్షి నిర్మల్
బుధవారం । 27 । డిసెంబర్ । 2023


గరిష్టం/కనిష్టం
30.1/15.2
వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మంచు అధికంగా కురుస్తుంది. తెల్లవారుజామున పొగ మంచు కురిసే అవకాశం ఉంది.

గిరివాసి మారలె..!


పెంబి మండలం చాకిరేవుకు వెళ్లే దారి..


కొట్టుకుపోయిన పస్పుల వంతెన


ఎన్నికలు బహిష్కరించిన గంగాపూర్ వాసులు


అటవీ గ్రామాల్లో దీపమే దిక్కు


కాలినడకన దొత్తివాగు దాటుతున్న గత కలెక్టర్ ముషరఫ్‌అలీ(ఫైల్)

- దారి లేదు.. వెలుగు రాదు..
- తాగునీటికి తప్పని తిప్పలు
- ఇప్పటికీ కాలినడకనే ప్రయాణం
- అర్ధరాత్రి.. అడవిలోనే ప్రసవాలు
- ఏళ్లు గడిచిపోతున్నా.. ఎన్నికలు బహిష్కరిస్తామన్నా..
- అటవీ గ్రామాల్లో అవే అవస్థలు

నిర్మల్: అద్దాల మేడలు, ధగధగ మెరిసే లైట్లు, వంపులు తిరిగే ఫ్లైఓవర్లు.. ఇవి కావు తెలంగాణ అంటే. పట్టణాలు దాటి పల్లెలను చూస్తే ఇప్పటికీ దారి తెలియని ఊళ్లు ఉన్నాయి. అభివృద్ధి చూడని గ్రామాలున్నాయి. అసలైన ఆ తెలంగాణకు ఇంకా అభివృద్ధి ఫలాలు అందడం లేదు.. జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాలే ఇందుకు నిదర్శనం. ఏళ్లు కాదు.. దశాబ్దాలు గడిచిపోతున్నాయి. కానీ గిరిజన గ్రామాలకు 'దారి' దొరకడం లేదు. అడవి బిడ్డల జీవితాల్లోకి 'వెలుగులు' రావడం లేదు. జిల్లాలోని గిరిప్రాంత ప్రజలకు 2023 కూడా నిరాశే మిగిల్చింది.



ఈ ఏడాదీ అదే'దారి'..

'అమ్మా.. మనం ఇట్ల ఇంకెన్ని రోజులు నడుసుకుంట పోవాల్నె..? పెంబికెల్లి ఖానాపూర్ దాకా ఉన్నట్లు మనూరికి రోడ్డు ఎందుకు లేదు..? మన ఊరికి కరెంటు రాదా? మనమెప్పటికీ చీకట్లనే ఉండాలా.. ఇట్లనే నడుసుకుంట పోవాల్నా..?' అంటూ అటవీ మార్గంలో తల్లి చేయి పట్టుకుని నడుస్తున్న పదేళ్ల పి ల్లాడు అడుగుతున్నాడు. తన కొడుకు అడుగుతున్న ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో తెలియని ఆ తల్లి.. 'ఏమో బిడ్డా.. నేను చిన్నగున్నప్పటి నుంచి ఇట్లనే ఉన్నం. ఇంకా ఎన్నేండ్లకు మన ఊళ్లు మారుతయో తెల్వది..' అంటూ నిట్టూరుస్తూ నడుస్తోంది. ఇది.. ఒక్క చాకిరేవుదో.. రాగిదుబ్బదో.. మిద్దెచింతదో.. కాదు.. జిల్లాలోని చాలా అటవీ గ్రామాల కష్టాలకు అద్దం పడుతున్న విషయం. పిల్లలు తల్లులు, తండ్రులే కాదు.. తాతలవుతున్నా.. తరాలే మారుతున్నా.. వాళ్ల జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడంలేదు. ఇవ్వాళ్ల కాకున్నా.. రేపొద్దున్న తమ జీవితాలు బాగుంటాయన్న ఆశతో నడుస్తున్నా.. వారి 'దారి'మాత్రం మారడం లేదు. సరైన మార్గం లేక.. అర్ధరాత్రిపూట ఎడ్లబండిపై వస్తూ దట్టమైన అడవిలో పురిటినొప్పులు భరించలేక ప్రసవించిన తల్లులెందరో ఉన్నారు.

ఆ ఊళ్లు నడవాల్సిందే..

- కడెం మండలం మిద్దెచింత, ఇస్లాంపూర్, గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా, అల్లంపెల్లి, బాబానాయక్ తండా పంచాయతీల పరిధిలో దాదాపు పదిగ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు.
- పెంబి మండలం చాకిరేవు, పెద్దరాగిదుబ్బ, చిన్నరాగిదుబ్బ, సోముగూడ, వస్‌పెల్లి, దోంధరి, గుమ్మెనఎంగ్లాపూర్ గ్రామాలకు ఇప్పటికీ దారి లేదు. రెండేళ్లక్రితం 2021లో కడెం వాగుపై కొట్టుకుపోయిన పస్పుల వంతెనను అలాగే వదిలేశారు. అప్పటి నుంచి అంకెన, రాయదారి, పస్పుల, కోరకంటి, డొయాలమద్ది, హరిచంద్‌తాండ గ్రామాలకు రవాణా సౌకర్యాలు దెబ్బతిన్నాయి. ధోత్తివాగు దాటడానికి రాంనగర్, యాపల్‌గూడ ప్రజలు తరాలుగా తిప్పలు పడుతూనే ఉన్నారు.
- ఖానాపూర్ మండలం బావాపూర్(ఆర్) పంచాయతీ పరిధిలోని పంగిడిగూడెం, కొలాంగూడ పరిధిలోని కుసుంపూర్, దేవునిగూడెం, అడవిసారంగపూర్ పరిధిలోని జిల్లెడుకుంట, కొత్తగూడెం గ్రామాలకు సరైన రోడ్డుసౌకర్యం లేదు. జిల్లెడుకుంట, కొత్తగూడెం ఊళ్లకు వెళ్లే దారిలో అటవీ ప్రాంతం నుంచి వచ్చే వాగులపై ప్రతీఏడాది తాత్కాలిక చర్యల చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.
- సారంగపూర్ మండలం ఇప్పచెల్మ, పెండల్‌ధరి తదితర గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్డుసౌకర్యాలు లేవు. వర్షాకాలంలో మధ్యలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి.
- మామడ మండలం తోటిగూడ, పులిమడుగు, రాంపూర్ గ్రామాలకు రోడ్లు లేవు.

తరాలు గడిచిపోతున్నై..



తరతరాలు గడిచిపోతున్నా మాకు రోడ్డు సౌకర్యం కల్పించడంలేదు. మా ఊరికి కరెంటు తీగలు కూడా లేవు. తాగు నీటికి ఇబ్బంది పడుతున్నం. ఇంకా ఇలా ఎన్నేళ్లు కష్టాలు పడాలో తెలుస్తలేదు.
– ఆత్రం శ్రీరామ్, గ్రామపటేల్, మిద్దెచింత

ఇప్పటికైనా అభివృద్ధి చేయాలి..



అటవీ ప్రాంత గ్రామాలను చిన్నచూపు చూసే ధోరణి ఉండొద్దు. కనీసం రోడ్డు లేక కాలినడక రావాల్సిన దుస్థితి ఉంది. కొత్త ఏడాదిలోనైనా కొత్త ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.
– ముత్యాల గంగారెడ్డి, అల్లంపెల్లి

ఈసారీ.. కరెంటురాలే..

జిల్లాలో ఇప్పటికీ పలు గ్రామాలకు సింగిల్‌లైన్ ఉండగా, మరికొన్ని పల్లెలకు అసలే కరెంటు లేదు. పెంబి మండలం చాకిరేవు, చిన్నరాగిదుబ్బ, పెద్దరాగిదుబ్బ, సోముగూడ, కడెం మండలంలోని మిద్దెచింత గ్రామాలు ఇప్పటికీ చీకట్లలోనే మగ్గుతున్నాయి. సోలార్‌లైట్లు పెట్టినా అవి మూడురోజుల ముచ్చటే అన్నట్లు మారుతున్నాయి. కరెంటు కోసం చాకిరేవు గ్రామస్తులు గతేడాది నిర్మల్ వరకూ నడుచుకుంటూ వెళ్లారు. చివరకు సోలార్ వెలుగులతోనే సరిపెట్టారు. ఇప్పటికీ ఆయా గ్రామాలకు కరెంటు సౌకర్యం లేదు. ఎందుకు ఇవ్వడం లేదని అధికారులను అడిగితూ.. అటవీ నిబంధనలు అడ్డుగా ఉన్నాయని చెబుతున్నారు. మరోవైపు 'అడవి జంతువుల కోసం అన్నీ చేస్తారు.. తాము అంతకన్నా హీనమా..?'అని ఆ పల్లెల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎన్నికలు బహిష్కరిస్తామన్నా..

'ఇలా.. ఇంకెన్నాళ్లు.. ఎదురుచూడాలి.. ఇక మావల్ల కాదు..' అంటూ జిల్లాలోని పలు అ టవీ గ్రామాలు ఇటీవల అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు పిలుపునిచ్చాయి. తమ క ష్టాలను తీర్చనప్పుడు తామేందుకు ఓటెయ్యాలంటూ వారాలకొద్దీ భీష్మించుకు కూ ర్చున్నారు. కడెం మండలం గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా, అల్లంపెల్లి పంచాయతీ లతోపాటు వాటి పరిధిలోని గ్రామాలు.. అ లాగే పెంబి మండలం గుమ్మెన ఎంగ్లాపూర్‌తోపాటు ఈ పంచాయతీ పరిధిలోని నాయకపుగూడ, గోండుగూడ ప్రజలు సైతం ఎన్నిక ల బహిష్కరణకు పిలుపునిచ్చారు. తహసీ ల్దార్లు, ఆర్డీవో, ఉన్నతాధికారులు ఎవరెన్ని చెప్పినా వినిపించుకోలేదు. చివరకు ఎన్నికల రోజు మధ్యాహ్నం రెండు గంటలకు అడిషన ల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ వచ్చి హామీ ఇవ్వడంతో వారు ఓటేశారు. హామీలు ఇచ్చినా.. ఇప్పటికీ ఆ గ్రామాల అభివృద్ధికి అడుగు ముందుకు పడడం లేదు.


గండిరామన్న ఆలయంలో భక్తుల పూజలు..

ఘనంగా దత్తజయంతి




ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


ముధోల్‌లో ఎమ్మెల్యే రామారావు పటేల్ పూజలు

దత్త జయంతి సందర్భంగా జిల్లాలోని గురు ఆలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే దత్తాత్రేయ, సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జిల్లాకేంద్రం శివారులోని గండి రామన్న క్షేత్రం, మంజులాపూర్ సాయిబాబా ఆలయానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. దత్తాత్రేయ, షిర్డీసాయి, విష్ణు సహస్రనామ, సుదర్శన హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి, మహా మంగళహారతి చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం పదివేల మందికి అన్నదానం చేశారు. మంజులాపూర్ సాయిబాబా ఆలయంలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కుంటాల సాయిబాబా ఆలయంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. భైంసా, ముధోల్, ఖానాపూర్‌తోపాటు, మండలాల్లోని ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం మంజులాపూర్ సాయిబాబా ఆలయంలో హుండీ లెక్కింపు చేపట్టగా.. రూ.58,280 ఆదాయం వచ్చింది. – నిర్మల్‌ఖిల్లా/నిర్మల్ టౌన్

ప్రజాపాలనకు షెడ్యూల్ విడుదల

- 28 నుంచి జనవరి 6 వరకు కార్యక్రమాలు
- ఐదు పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆరు గ్యారంటీలను అర్హులకు అందించడంతోపాటు సాధారణ విజ్ఞప్తులను స్వీకరించేందుకు ఈనెల 28 నుంచి వచ్చే 6వ తేదీ వరకు ప్రజాపాలన సభలను నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. జిల్లాలోని 396 గ్రామపంచాయతీలు, 3 మున్సిపాలిటీల్లో ప్రత్యేక సభలు నిర్వహించనున్నారు. గ్రామస్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపాలిటీల్లో వార్డు స్థాయిలో మున్సిపల్ కమిషనర్ల నేతృత్వంలో ప్రజాపాలన సభలు నిర్వహించనున్నారు. నియోజకవర్గస్థాయిలో ఒక నోడల్ అధికారి ఉంటారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు 8 రోజుల పాటు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈనెల 31, జనవరి 1న సెలవు కావడంతో ఆ రోజు ప్రజాపాలన సభలు ఉండవు.

ప్రతీ దరఖాస్తు నమోదు..

ప్రతీ దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతోపాటు, ధరణి, భూకబ్జాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంపై వచ్చే ఫిర్యాదులను వేర్వేరు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించింది.

అయోధ్య అక్షింతలకు అపూర్వ స్వాగతం


మంగళహారతులతో భారీగా తరలివచ్చిన మహిళలు


అయోధ్య అక్షింతలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్, తీర్థ క్షేత్ర సభ్యులు

భైంసాటౌన్: అయోధ్యలో భవ్య రామమందిరం నిర్మాణం పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా అయోధ్య అక్షింతలు మంగళవారం భైంసా పట్టణానికి చేరుకున్నాయి. స్థానిక శివాజీచౌక్ వద్ద స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావుపటేల్‌తోపాటు వీహెచ్‌పీ, తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు హాజరై శ్రీరాముడి చిత్రపటంతోపాటు అక్షింతలకు పూజలు చేశారు. అనంతరం శోభాయాత్ర ప్రారంభించారు. శ్రీరాముడి చిత్రపటం, అక్షింతలను పల్లకిలో ఉంచి మహిళల మంగళహారతులు, మంగళవాయిద్యాల నడుమ స్థానిక వేంకటేశ్వర ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో అక్షింతల కలశాలు, శ్రీరాముడి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అక్షింతల కలశాలను ఇంటింటికీ అందజేసేలా గల్లిల వారీగా నియమించిన ప్రముఖులకు అందజేశారు. జనవరి 1 నుంచి 15 వరకు జన సంపర్క అభియాన్‌లో భాగంగా ప్రతీ ఇంటికి అయోధ్య అక్షింతలు, కరపత్రాలు, మందిర చిత్రపటం అందించనున్నట్లు తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, తీర్థక్షేత్ర సభ్యులు సాదుల కృష్ణదాస్, శైలేష్ మాశెట్టివార్, వెంకటేశ్, దామోదర్, లింగన్న, మహిపాల్, విలాస్ గాదేవార్, నారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జెడ్పీలో అవిశ్వాసం లేదు


విజయలక్ష్మికి మద్దతు తెలుపుతున్న జెడ్పీటీసీలు

నిర్మల్ రూరల్: జెడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు ఖండించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 11 మంది జెడ్పీటీసీలు, కోఆప్షన్ సభ్యులు మంగళవారం సమావేశమయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయలక్ష్మిపై ఎలాంటి అవిశ్వాస తీర్మానం పెట్టడం లేదని తెలిపారు. ఏకగ్రీవంగా మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పుకార్లను నమ్మొద్దని కోరారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ సాగరబాయి, జెడ్పీటీసీలు లోలం కళావతి, శ్రీనివాస్ రెడ్డి, శాంతాపురం శారద, భూక్య జానకిబాయి, రాజమణి, రామయ్య, జీవన్‌రెడ్డి, సరోజిని, గంగమణి, అల్కాతాయి, రాజేశ్వర్, కోఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా..

ప్రతీ అక్షరం.. ప్రజాపక్షంగా 'సాక్షి' ప్రస్థానం సాగిస్తోంది. 2023లో 'సాక్షి' ఎంతోమందిని తన అక్షరంతో కదలించింది. ఆపదలో ఉన్నవారికి చేయూతనందించింది. - వివరాలు 8లో▸

కాలువ ఇలా.. చేలకు తడెలా?

- జిల్లాలో అధ్వానంగా సరస్వతి కెనాల్
- 70 శాతం చెదిరిపోయిన సిమెంట్ లైనింగ్
- ప్రవాహానికి అడ్డుగా చెత్త, చెదారం
- జిల్లాలో 47 కిలోమీటర్ల పొడవు.. 35 వేల ఎకరాల ఆయకట్టు
- నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు
- నేటి నుంచే యాసంగి పంటలకు సాగునీరు


రాచాపూర్ వద్ద లైనింగ్ చెదిరిపోయిన సరస్వతి కాలువ


తుప్పపట్టిపోయిన 18 డిస్ట్రిబ్యూటరీ గేట్

లక్ష్మణచాంద: ఈ ఏడాది వానాకాలం పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడి ఇవ్వలేదు. దీంతో యాసంగి పంటలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో 35 వేల ఎకరాలకుపైగా సాగునీరు అందించే సరస్వతి కాలువను నమ్ముకుని పంటలు సాగుచేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే కాలువ పరిస్థితి చూసిన రైతులు చివరి ఆయకట్టుకు నీరందుతుందా లేదా అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తుండడంతో పూర్తి ఆయకట్టుకు నీరందడం కష్టమే అన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం నిర్మించిన సిమెంట్ లైనింగ్ పూర్తిగా చెదిరిపోయింది. ఎప్పుడు ఎక్కడ గండి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో బుధవారం నుంచి కాలువకు నీరు విడుదల చేయనున్నారు.

35,665 ఎకరాల ఆయకట్టు ....

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలో ప్రవహించే సరస్వతి కాలువ ద్వారా సోన్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, కడెం, పెంబి మండలాల పరిధిలోని 35,665 ఎకరాలకు సాగునీరందుతుంది. సోన్ మండలంలో 7,895 ఎకరాలు, లక్ష్మణచాంద మండలంలో 8,662 ఎకరాలు, మామడ మండలంలో 5,273 ఎకరాలు, ఖానాపూర్ మండలంలో 10,469 ఎకరాలు, కడెం మండలంలో 735 ఎకరాలు, పెంబి మండలంలో 2,631 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువకు పదేళ్లగా ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. నిర్వహణను కూడా తూతూ మంత్రంగా చేపడుతున్నారు.

ప్రధాన సమస్యలివీ..

- సరస్వతి కాలువ జిల్లాలో 47 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఈ కాలువ లైనింగ్ 70 శాతం చెదిరిపోయింది. ఎప్పుడు ఎక్కడ గండి పడుతుందో తెలియని పరిస్థితి.
- ఇక కాలువ నిండా చెత్త, చెదారం పేరుకుపోయింది. ప్రవాహానికి ఆటంకంగా మారే ఈ చెత్తతో కాలువ బలహీనంగా ఉన్నచోట గండి పడే అవకాశం ఉంది. నిర్వహణలోపంతోనే చెత్త, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయని రైతులు అంటున్నారు.
- ఈ వానాకాలంలో భారీ వర్షాలకు లక్ష్మణచాంద మండలంలోని న్యూ కంజర్ సమీపంలో కాలువ పైన ఉన్న పంట చేల నుంచి పెద్ద ఎత్తున వరద కాలువలోకి పోటెత్తింది. దీంతో కెనాల్‌కు గండి పడడంతోపాటు మట్టి పేరుకుపోయింది. ఇప్పటికీ దానిని తొలగించలేదు. బాబాపూర్, నర్సాపూర్ గ్రామాల మధ్య రెండు చోట్ల కాలువ గట్టు బలహీనంగా ఉంది.
- నర్సాపూర్ సమీపంలోని డిస్ట్రిబ్యూటరీ 18కు ఉన్న గేట్ తలుపు పూర్తిగా తుప్పుపట్టిపోయింది. దీంతో నీరు కిందకు వెళ్లకుండా ఆపే పరిస్థితి లేదు. అవసరం లేకున్నా నీరు వెళ్తుంది.
- కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్, మా సాయిపేట్, పెత్తర్పు, పెద్దూర్ తాండా గ్రా మాలకు నీటిని సరఫరా చేసే డి27 కాలువకు నీరు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు.
- మామడ మండలం కొరిటికల్, చందారం గ్రామాల కెనాల్ లైనింగ్ దెబ్బతిన్నది. అనేక చోట్ల లైనింగ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయ. ఇలాంటి పరిస్థితిలో బుధవారం నుంచి విడుదల చేసే నీరు చివరి ఆయకట్టుకు అందే అవకాశం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి యాసంగి పంటకాలం పూర్తయ్యే వరకూ కాలువను నిరంతరం పర్యవేక్షించాలని రైతులు కోరుతున్నారు.

తూము గేటుకు మరమ్మతు చేపట్టాలి



మాది లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ గ్రామం. మా గ్రామంలోని పంటలకు నీరందించే డిస్ట్రిబ్యూటరీ 18 కాలువ తూము గేటు తుప్పుపట్టిపోయింది. వెంటనే మరమ్మ తు చేపట్టి నీరు వృథాగా పోకుండా చర్యలు చేపట్టాలి.
– ముత్యాల మోహన్‌రెడ్డి, రైతు, నర్సాపూర్

చివరికి నీరందేలా చూడాలి..



సోన్ మండలం సంఘంపేట్ గ్రామ సమీపంలో వానాకాలంలో కాలువకు గండిపడింది. అధికారులు మట్టిపోసి తాత్కాలికంగా గండి పూడ్చారు. నీటి విడుదలతో మళ్లీ గండి పడే అవకాశం ఉంది. శాశ్వత మరమ్మతులు చేపట్టాలి. చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి.
– తోట సాయన్న, రైతు, న్యూవెల్మల్

నిధులు రాగానే మరమ్మతులు

చిన్న చిన్న మరమ్మతులకు ఎస్టిమేట్ చేయించే అవకాశం ఉంది. కాలువకు పూర్తి స్థాయిలో లైనింగ్, ఇతర పనులు చేయాలంటే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాలి. పునరుజ్జీవ పథకం కింద నిధులు విడుదలచేసే అవకాశం ఉంది. అవి రాగానే మరమ్మతులు చేపడుతాం. – మధుకర్, ఏఈ ఇరిగేషన్



క్లుప్తంగా

ఉత్పత్తి సంస్థలో మహిళలు భాగం కావాలి

లోకేశ్వరం: ఉత్పత్తి సంస్థలో మహిళా రైతులు సభ్యత్వం తీసుకుని భాగస్వాములు కావాలని రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ముఖ్య కార్యనిర్వహణ అధికారి మేఘన సూచించారు. సభ్యత్వం తీసుకున్న వారు రసాయ, సేంద్రియ ఎరువులు, విత్తనాలు రాయితీపై పొందవచ్చని తెలిపారు. మండలంలోని ధర్మోరలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా మేఘన మాట్లాడుతూ సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పొందడమే కాకుండా పంట అనంతరం కొనుగోలు అమ్మకాలు చేసుకుని లాభం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అరణ్య ఫౌండేషన్ ప్రతినిధి సుమాన్‌కుమార్, నాయకులు మంద భాస్కర్, స్వామిగౌడ్, సునీల్ రెడ్డి, మంద గణేశ్, గంగాధర్ పటేల్, ఆజోబ పటేల్, దేవాగౌడ్, వెంకటేశ్, దిలీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెంకటయ్య బావి నవల ఆవిష్కరణ

లక్ష్మీకాపూల్: వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని తెలిపారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్ కుమార్ డబ్బీకా ర్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్స్ కమిటీ ఎన్నిక

మంచిర్యాలటౌన్: ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మండల భాస్కర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా దుర్గం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా దున్న సునిల్ కుమార్, లీగర్ అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా గురునాథం బాబు గౌడ్, ఉపాధ్యక్షులుగా బి.దేవేందర్, వై. రాజశేఖర్ రెడ్డి, ఎస్.జయశీల, రత్నం శ్రీకాంత్, కన్వీనర్‌గా భూపెల్లి మల్లేశ్, కోశాధికారిగా గడ్డం మహవీర్, కార్యదర్శులుగా పానగంటి హరీష్, కొండగూర్ల చంద్రశేఖర్, రజిత, మురళి, అధికార ప్రతినిధులుగా ఎస్. దేవరాజ్, కోకన్వీనర్లుగా గణేశ్, వెంకటేశ్, మారపెల్లి కుమార్, జనార్దన్, కార్యవర్గ సభ్యులుగా గంగారపు నటరాజ్, నెన్నెల నర్సయ్య, నాగ మల్లేశ్, మిట్ట సుజాత, గౌతమ్, రామగోని మహేందర్, అరిగెల నరేశ్ గౌడ్, బి. శ్యాంకుమార్, చిలుముల రమేశ్, నరేశ్, వేముల రాజలింగు, బొల్లం నాగరాజును ఎన్నుకున్నారు.

30 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 30మందికి జరిమానా, ముగ్గురికి సాధారణ జైలు విధిస్తూ.. నిర్మల్ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ.. పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరుపరిచారు. 30మందికి రూ.25,700 జరి మానా, ఒక్కొక్కరికీ ఒక రోజు జైలు, ఇద్దరికీ మూడు రోజులు సాధారణ జైలు శిక్ష విధి స్తూ.. స్పెషల్ జ్యూడిషల్ జడ్జి తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపిప్రమాదాలకు కారణం కావద్దని ఎస్సై పేర్కొన్నారు.

ప్రజల గొంతుకగా..

- ప్రజల పక్షపాతిగా కథనాలు..
- స్పందించిన అధికారులు.. అక్రమార్కులపై చర్యలు

ప్రజల సమస్యల పరిష్కారానికి 'సాక్షి' తనవంతుగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగానికి సంబంధించి పలు విభాగాల్లో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై దృష్టి సారించి ఏడాది పొడవునా ప్రచురించిన పలు కథనాలకు జిల్లా అధికారులు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా, అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. 2023లో సాక్షిలో ఎఫెక్ట్ కథనాలు..

– ఆదిలాబాద్‌టౌన్/ఇచ్చోడ/కైలాస్‌నగర్/ఆదిలాబాద్



















- విద్యాశాఖలో అక్రమార్కుడు.. అనే కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించారు. సదరు సిబ్బందిని డీఈవో కార్యాలయం నుంచి తొలగించి పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు.
- రిమ్స్ నుంచి వెళ్లగొడితే ప్రైవేట్‌లో ప్రసవం.. అనే కథనానికి అప్పటి డీఎంఈ స్పందించారు. విచారణ చేపట్టి రిమ్స్‌లోని గైనిక్ విభాగంలో పనిచేసే ఆ వైద్యుడిని తొలగించేలా ఆదేశాలు జారీ చేశారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీకి కేటాయించారు.
- తొమ్మిది మంది టీచర్లకు డిప్యూటేషన్.. అనే కథనానికి డీఈవో స్పందించారు. జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో అక్రమంగా డిప్యూటేషన్ ఇవ్వగా..ఈ కథనానికి స్పందించి వారి డిప్యూటేషన్‌ను రద్దు చేశారు.
- రిమ్స్ అక్రమార్కులపై కలెక్టర్ సీరియస్.. అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. రిమ్స్‌లో పనిచేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి ఓ నిరుద్యోగి నుంచి రూ.లక్ష తీసుకొని ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు.
- మరో వసూల్ రాణిపై.. రిమ్స్‌లో పనిచేసే ఓ ఉద్యోగిని స్టాఫ్ నర్సుల నుంచి రూ.లక్ష 50వేల వరకు డబ్బులు వసూలు చేశారు. ఇంక్రిమెంట్ కల్పిస్తానని చెప్పి ఇబ్బందులకు గురిచేశారు. సాక్షి కథనానికి స్పందించిన డీఎంఈ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ ఉద్యోగిని రిమ్స్ నుంచి డీఎంఈ కార్యాలయానికి సరెండర్ చేశారు.
- నచ్చినట్లు సర్దుబాటు.. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఇచ్చోడ మండలంలోని తలమద్రి పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల కోసం ఏడుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు ప్రచురించడం జరిగింది. ఆ ఇద్దరు విద్యార్థులను వసతిగృహానికి తరలించి ఆ ఉపాధ్యాయులను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేశారు.
- బస్సు రాదాయే.. అనే శీర్షికన ఈనెల 11న సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఆర్టీసీ అధికారులు జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్‌కు, సిరికొండ మండలానికి బస్సును పునరుద్ధరించారు.
- ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్ శివారు సర్వే నెంబర్ 21లోని ప్రభుత్వ అసైన్డ్ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై సాక్షి కథనానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పందించారు. వాటిని కూల్చివేశారు.
- ఈకేవైసీ ఇక్కట్లు శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఎస్వో కిరణ్ కుమార్ స్పందించారు. పట్టణంలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలను సందర్శించి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయించారు.
- అక్రమార్కుల్లో గుబులు శీర్షికన ఈ నెల 11న ప్రచురితమైన కథనం అధికారవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అవినీతికి పాల్పడుతున్న వారిపై ఉన్నతాధికారులు ఆరా తీశారు.
- అస్తవ్యస్తంగా బల్దియా పాలన అనే కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. అన్ని విభాగాల అధికారులకు మెమోలు జారీ చేశారు.

'ఇంజనీరింగ్' ఇచ్చి..



ఉమ్మడి జిల్లాకు ఇంజనీరింగ్ కాలేజీ

నిర్మల్: జూన్ 4న అప్పటి సీఎం కేసీఆర్ సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవ నేపథ్యంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా 'సాక్షి' జిల్లా టాబ్లాయిడ్‌లో 'ఇంజనీరింగ్ ఇవ్వండి సారూ..'శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఇదే విషయాన్ని బహిరంగ సభలో అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో ఆదిలాబాద్ జిల్లాకు జేఎన్‌టీయూ బ్రాంచ్‌ను మంజూరు చేస్తున్నట్లు కేసీఆర్ ప్రకటించారు.

అపరేషన్‌కు అండగా..



కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన నాంపల్లి మల్లేశ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపరేషన్‌కు డబ్బులు లేక మంచం పట్టాడు. మల్లేశ్ దీనగాథను 'నా కొడుకును కాపాడండి' అనే శీర్షికన సాక్షి ప్రచురించింది. దీంతో దాతలు స్పందించి సుమారు రెండు లక్షల వరకు అందజేసి మల్లేశ్ అపరేషన్‌కు సహకరించారు.

- బస్సే ఎరుగని పల్లెలు అనే శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ నెల 25 నుంచి అల్లంపల్లికి బస్సును ప్రారంభించారు.

సాక్షి ఎఫెక్ట్ కథనాలు

- ఇచ్చోడ మండల కేంద్రంలో నిరుపయోగంగా బస్టాండ్ అనే శీర్షికన మార్చి 21 సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు బస్టాండ్‌ను పునరుద్ధరించారు.
- జూన్ 10వ తేదీన కబ్జాకు గురవుతున్న రో డ్లు శీర్షికన కథనానికి అధికారులు స్పందించి కబ్జాదారులకు నోటీసులు అందచేశారు.
- అక్టోబర్ 23 ఇచ్చోడలో... కంపు కంపు వార్తకు అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించారు.









ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: దిలవర్‌పూర్–గుండంపల్లి మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను వెంటనే రద్దు చేయాలని వామపక్ష సంఘాలు డిమాండ్ చేశాయి. ఇథనాల్ పరిశ్రమను రద్దు కోరుతూ వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం రౌండ్ టేబు ల్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప రిశ్రమ ఏర్పాటుతో ప్ర జలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మించిన ఇథనాల్ పరిశ్రమతో అక్కడి ప్రజలు అనేక దుష్ఫలితాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరిశ్రమ నిర్మాణం పూర్తయితే కాలుష్యంతో పలు గ్రామాల ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు, రైతులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల పోరాటం నేపథ్యంలో పరిశ్రమ రద్దు చేయాని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ఎస్ఎస్.రెడ్డి, సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, తెలంగాణ ప్రజా జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ ఆరేపల్లి విజయ్‌కుమార్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

ప్రాణం తీసిన బాబాయ్..

భూ తగాదాలతో దారుణ హత్య

- గొడ్డలితో నరికి.. కత్తితో పొడిచి..
- ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు
- అన్నదమ్ముల మధ్య భూవివాదమే కారణం
- పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘటన..

ఇచ్చోడ: భూవివాదంలో సొంత బాబాయ్ తన కుమారుడితో కలిసి యువకుడిని హత్య చేసిన సంఘటన ఇచ్చోడలో చోటుచేసుకుంది. మూడెళ్లుగా అన్నదమ్ముల మధ్య కొనసాగుతున్న భూ వివాదమే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని సాథ్ నంబర్ గ్రామానికి చెందిన వానోలే కేదోబ, పాండురంగ్‌లు అన్నదమ్ములు. కేదోబ ఐటీడీఏ ఉపాధ్యాయుడిగా పనిచేసి నాలుగేళ్ల కిందట పదవీ విరమణ పొందాడు. పాండురంగ్ ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తూ రెండు నెలల కిందట గుండెపోటు రావడంతో ఫిట్‌నెస్ లేక డ్యూటీకి వెళ్లడం లేదు. ఇద్దరు అన్నదమ్ములకు తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి సాథ్‌నంబర్‌లోని జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. ఈ భూమి తల్లి పేరు మీద పట్టా ఉంది. కానీ గత సంవత్సరం కిందట పాండురంగ్‌కు తెలియకుండానే కేదోబ కుమారుడు ఈశ్వర్ (29) తన తండ్రి కేదోబ పేరిట ఎకరం, కేదోబ చెల్లెలు పేరిట మరో ఎకరం, తన పేరిటా ఎకరం ఇలా నాలుగు ఎకరాల భూమిని విరాసత్ ద్వారా పట్టాలు చేసుకున్నాడు. వారసత్వంగా వచ్చే భూమిలో వాటా ఇవ్వకుండా పట్టా చేసుకోవడంపై ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం ప్రారంభమైంది. ప్రస్తుతం భూ వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ విషయంపై చాల సార్లు కుల పెద్దల మధ్య పంచాయితీ కూడా నిర్వహించారు. నెలరోజుల క్రితం ఈశ్వర్ తన తండ్రి కేదోబ పేర్ల మీద ఉన్న భూమిని కోటి రూపాయలకు విక్రయించినట్లు ప్రచారంలో ఉంది. తన వాటా దక్కకుండా భూ వివాదం కోర్టులో ఉండగా విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పాండురంగ్ ఈశ్వర్‌పై పగా పెంచుకున్నాడు. మంగళవారం ఉదయం 8గంటల ప్రాంతంలో పాండురంగ్ తన కుమారుడు సూర్యకాంత్‌ను తీసుకొని సాథ్‌నంబర్ నుంచి ఇచ్చోడలోని సిరిచెల్మ చౌరస్తాలో ఈశ్వర్ కోసం కాపు కాశాడు. టీచర్స్‌కాలనీలో నివాసముండే ఈశ్వర్ ఉదయం 9గంటల ప్రాంతంలో ఇంటి నుంచి నడుచుకుంటూ సిరిచెల్మ చౌరస్తాలో పాన్‌టేలకు వెళ్లాడు. అక్కడ సమీపంలోని పాండురంగ్, సూర్యకాంత్‌లు ఈశ్వర్‌పై దాడికి ప్రయత్నించారు. దీంతో ఈశ్వర్ తప్పించుకునే క్రమంలో సిరిచెల్మ రోడ్డులోని ప్రభుత్వ ఆస్పత్రి వైపు పరుగులు తీశాడు. పాండురంగ్, సూర్యకాంత్ వెంబడించి సాయిసామత్ ప్రైవేట్ కళాశాల ఎదుట ఈశ్వర్‌ను పట్టుకొని గొడ్డలితో నరికి కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేష్ తెలిపారు.



సంఘటన స్థలంలో ఈశ్వర్ మృతదేహం



ఈశ్వర్(ఫైల్)

వనవాసుల సంక్షేమం కోసం కృషి

నిర్మల్: అడవులనే నమ్ముకుని జీవనం సాగించే గిరి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వనవాసీ కల్యాణ పరిషత్ ఏర్పడిందని పరిషత్ తెలంగాణ ప్రాంత విద్యాప్రముఖ్ మైసర్ల శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం వనవాసీ కల్యాణ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో పరిషత్‌ను ప్రారంభించారని, దీని ద్వారా దేశంలోని 12కోట్ల మంది గిరిజనుల వికాసం కోసం వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారని వివరించారు. గిరిజనులకు విద్య, వైద్యం తదితర విషయాల్లో కృషి చేస్తోందన్నారు. గిరిసంస్కృతి, మతమార్పిడులు, పోడుభూములపైనా అవగాహన కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గుద్దేటి నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరుకాగా, పలువురు యువకులు, పరిషత్ బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైసర్ల శంకర్

రెండు ఇళ్లల్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో రెండిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మాదస్తు విజయ్ కుమార్ సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లాడు. అలాగే వారి బంధువులైన మాదస్తు లక్ష్మి సైతం తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. రాత్రి దొంగలు ఈ రెండు ఇళ్లల్లో చొరబడ్డారు. విజయ్‌కుమార్ ఇంట్లోని అరతులం బంగారంతో పాటు నాలుగు తులాల వెండీ, రూ.6వేల నగదును ఎత్తుకెళ్లారు. లక్ష్మి ఇంట్లో నుంచి వెండీ ఆభరణాలు అపహరించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

తాంసి: మద్యం మత్తులో ఒకరు ఉరేసేకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భీంపూర్ మండలంలోని కరింజి(టి) గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కరంజి(టి) గ్రామానికి చెందిన మర్ల మహేందర్(39) వ్యవసాయం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. అయితే నాలుగేళ్లుగా మద్యానికి బానిసై పనులకు వెళ్లడం లేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో మంగళవారం ఉదయం ఇంటి ఎదుట గల పశువుల పాకలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పురుగుల మందు తాగడంతో చనిపోయే అవకాశం లేదని పాకలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లాల్ సింగ్ నాయక్ మృతదేహన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంతానం కలగడం లేదని ఉరేసుకుని..

లోకేశ్వరం: సంతానం కలగడం లేదని ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన రామిల్లి సాయిలు(45)కు అనురాధతో వివాహమైంది. ఏళ్లు గడుస్తున్నప్పటికీ సంతానం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్ర గాయాలైన వెంకటకృతిక్(చక్రీ)(19) మంగళవారం మృతిచెందినట్లు ఏఎస్సై మారుతి తెలిపారు. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం... భైంసా పట్టణానికి చెందిన వెంకటకృతిక్(చక్రీ) సోమవారం ద్విచక్రవాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా వానల్‌పాడ్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్రగాయాల పాలైన వెంకటకృతిక్‌ను కుటుంబీకులు భైంసాలో ప్రాథమిక చికిత్స అనంతరం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. చక్రీ పంజాబ్‌లో బీఎస్సీ అగ్రికల్చరర్ చదువుతున్నాడు. సెలవుల్లో ఇంటికి వచ్చిన ఇలా మృతిచెందడం కుటుంబీకులను కలిచివేస్తుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
PLOT FOR SALE
Banjara Hills, Road No. 3, 200 Sq.yards Open Plot (Size: 40'x45') N/F, Reg. Document. U.L.C.N.O.C. Near Kalyani Mandapam. Mr. Khaja PH: 8639447160. [HA-1034]

SERVICES
BUSINESS OFFER
ద్వారా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED ... 9310515624, 8800496710 [H-42904]

WANTED
... 9640258899 / 9640468899. [H-793668]

మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9849933042, 9177736926. [M-1167575]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,